# మనసు తిరగబడింది

సాయంకాలం అయిదున్నర గంటలయింది. గిరిజ ఆఫీసులో నించి బైటకి వచ్చింది. అంతవరకూ ఫెళ్ళున కాసిన ఎండ ఎక్కడికి పోయిందో ఆకాశం అంతా మబ్బు పట్టివుంది.

రెండచినుకులు వేసిందోలేదో వర్షం ప్రారంభమైంది. క్షణాల్లోనే అది పెద్దది అయిపోయింది. అరఫర్లాంగు నడిస్తే కానీ సిటీ బస్ స్టాపు చేరుకో లేని గిరిజ విసుగ్గా అనుకుంది "దిక్కుమాలిన వర్షం ఇప్పుడే రావాలా"

గిరిజ తడిసిపోయింది. బస్టాండుకి వెళ్ళాలి. బస్‌కోసం వెయిట్ చేయాలి. తడిసిన బట్టలవైపు చూసుకుంటూనే నడకవేగం హెచ్చించింది.

బస్‌స్టాపులో అప్పటికి చాలామంది ప్రయాణీకులున్నారు. పావు గంట అర్ధగంట వెయిట్ చేసినా ఒక్క బస్సూ రాలేదు. వచ్చే సూచనలూ లేవు. వచ్చినా ఇక్కడ ఆగుతుందన్న నమ్మకమూ లేదు.

ఇంటికి వెళ్ళిపోవాలి. ఎలా ! త్వరగా ఇల్లు చేరాలి ఎలా? ఆటోలు లేవు. రిక్షాలు లేవు. ఉదయం తొమ్మిదిన్నరకి ఇల్లు వదిలింది. వెళ్ళిపోవాలి ఎలా ఎలా! ఆతురత పడిపోసాగింది గిరిజ. ఇంతలో ఓ బస్ రానూ వచ్చింది ఆగకుండా వెళ్ళనూ వెళ్ళింది. దీర్ఘంగా నిట్టూరుస్తున్న గిరిజకి దూరం నించివస్తున్న 'మారుతి' కారు కన్పించింది. అంతే రోడ్డు మధ్యగా వస్తూ రెండు చేతులూ ఆపమన్నట్లుగా వూపసాగింది. తను ఎదురింటి మేడ వారిదా కారని ఇట్టే గుర్తించి మరీ ముందుకు వచ్చింది. మేడ యజమాని

హరిగోపాల్ డ్రైవ్ చేస్తున్నాడు. ఆయన పక్కనే కూర్చుంది ఆయన సతీమణి స్వరూప. స్వరూప చాలా అందగత్తె. అందానికి తగ్గట్లు అలంకరణ కూడా ప్రత్యేక పద్ధతిలో చూసేవారిని ఇట్టే ఆకర్షించేలా వుంటుంది. ఆవిడ మాటతీరు కూడా ప్రత్యేకంగానే వుంటుంది. తగ్గు స్వరంలో గమ్మత్తుగా వుంటుంది. ఆ భార్యాభర్తల జంట చూడముచ్చటగా వుంటుంది. అనుకుంటుంది గిరిజ.

ఇంటికి వెళ్ళాలనే తొందరలో అనారోగ్యరాలైన కూతురు ఒంటరిగా వుందన్న ఆరాటంలో ఆ శ్రీమంతుల కారు ఆపమని అడిగే అర్హత తనకి వుందా ! లేదా! అని ఆలోచించలేదు గిరిజ. హరిగోపాల్ కారు స్లో చేశాడు. అయినా అది కాస్త ముందుకే వెళ్ళి ఆగింది. గిరిజ ఆనందపడిపోతూ చెప్పులు జారిపోయేది కూడా చూడకుండా పరుగెత్తింది.

మా కారుని ఆపమనటానికి నీకు ఎన్ని గుండెలు అన్నట్లుగా వురిమి చూసింది స్వరూప.

గిరిజ టక్కున ఆగిపోయింది. తన వెనుక నుండి పరిగెత్తుకొచ్చిన ఓ పదహారేళ్ళఅమ్మాయి గభాలున కారుడోర్ తీసుకుని లోపల కూర్చుంది అంతే కారు వెళ్లిపోయింది.

భోరున వస్తూన్న ఏడుపుని ఎంతో కష్టంమీద ఆపుకుంది. "సిస్టర్ మీ కభ్యంతరం లేకపోతే చెప్పండి. నేను మీ ఇంటి దగ్గర దించుతాను" ఓ ఇరవై ఏళ్ళ ముస్లిమ్ యువకుడు స్కూటర్ ఆపి మర్యాదపూర్వకంగా అడిగాడు. గిరిజ కళ్ళలో నీళ్లు జలజలా రాలాయి 'థాంక్స్' అంటూ అతను స్కూటర్ స్టార్టు చేయగానే ఎక్కికూర్చుని అడ్రెస్ చెప్పింది. ఆమె చెప్పినట్లుగానే అతను తీసుకువెళ్ళాడు. స్కూటర్ దిగి అతనికి మరీ మరీ కృతజ్ఞతలు చెప్పింది. 'టీ' తీసుకుందురుగాని రండి అంది. 'ఒద్దమ్మా పనివుంది' అతను వెళ్ళిపోయాడు. గిరిజ దీర్ఘంగా నిట్టూర్చి తాళం తీసి తలుపులు తెరిచి 'పాపా ఎలా వున్నావు తల్లీ' అంటి లైటువేస్తూ కూతురు పడుకున్న మంచం దగ్గరగా వచ్చింది. "అమ్మా.... నన్ను.... చీమలు కుట్టే

స్తున్నాయమ్మా...." "చీమలా ఎక్కడ" చప్పున పాపని లేవ నెత్తబోయింది. "ఒద్దమ్మా.... ఎత్తుకోకు, దొడ్డికెళ్ళాను రెండుసార్లు" నాలుగేళ్ళపాప ఏడుపు స్వరంతో అంది గిరిజకి వుప్పెనలా దుఃఖం ముంచుకొచ్చింది. చకచకా పక్కబట్టలు మార్చి పాపని తడిబట్టతో తుడిచి కన్పించినంతవరకూ ఎర్రచీమలని ఏరి పారేసి కూతుర్ని గుండెలకి హత్తుకుంది.

పాప తల్లిగుండెల దగ్గర వెక్కిళ్ళు పెడుతూ వుంది.

గిరిజ కళ్ళు ధారాపాతంగా వర్షించసాగాయి. కూతురివైపు తదేకంగా చూస్తూ అనుకోసాగింది. ఏమిటీ దురదృష్టం. చంద్రబింబంలాంటి ముఖం బంగారు రంగులాంటి శరీరపురంగు, పెద్ద కళ్ళు చురుకైన ముఖంతో పుట్టిన ఈ పాపని చూసుకుని పురిటినెప్పుల బాధని అప్పుడే మరిచిపోయి ఎంత గర్వపడింది. ఈ అందమైన పాపని చూసుకుని తన భర్తగోపి ఎంత మురిసిపోయాడు. నాలుగునెలలు జరిగిన తర్వాతగానీ పాప చేతులూ కాళ్ళూ మెడా నడుమూ సరిగా పని చేయడంలేదని తెలియలేదు ఇదేమిటీ అని ఆరాటపడిపోతూ డాక్టర్ దగ్గరకి తీసుకవెళ్ళారు. ఆయన ఆరునెలలు మందిచ్చినా ఏం ప్రయోజనం కన్పించక డాక్టర్‌ని మార్చారు. ఆ డాక్టర్ నీమార్చారు. ఇద్దరూ సెలవు పెట్టేసారు. ఎన్నినెలలో నిద్రాహారాలు లేకుండా పిచ్చివాళ్ళలా ప్రతి డాక్టర్ దగ్గరకీ వెళ్ళారు. ఎంత డబ్బు అయినా వెనకాడలేదు. అప్పుచేసారు అయినా పాపకి ఏ మాత్రం నయం కాలేదు వూహ తెలుస్తోంది. తనతోటి పిల్లల్లా తను లేను అన్నది గ్రహించ గల్గుతోంది. ఏడుస్తోంది. అయినా భార్యాభర్తలు ఏం చేయలేకపోయారు. ఇద్దరికీ కంపెనీల్లో ఉద్యోగాలే గిరిజ తొమ్మిదింటికి వెళ్ళి ఆరుగంటలకి ఇల్లు చేరుతుంది. గోపికి షిఫ్ట్ 'డ్యూటీ' ఇద్దరూ టైపిస్టులే. అయినా తమ ఖర్చులని ఎంతో పొదుపుగా వాడుకుని పిల్ల ఆరోగ్యంకోసం డబ్బు ఖర్చు పెడుతున్నారు. ఆఫీసుకి వెళ్ళేప్పుడు పాపకి కావాల్సినవి ఇచ్చి ఇల్లు బైట తాళం వేసి వెడుతుంది. ఆఫీసులో అయిదున్నర అయిందంటే చాలు ఇంటికి రెక్కలు కట్టుకువాలాలని గిరిజ మనసు తహతహలాడుతుంది.

ఇలా కొంచెం ఆలస్యంగా వచ్చినప్పుడు కూతురు స్థితిని చూస్తే గుండె బరు వెక్కుతుంది.

తన కడుపున పుట్టిన పాపానికా పాప ఇలా అయింది! తను చేసిన తప్పేమిటి! మేనమామను పెళ్లాడటం ఒక్కటే తను చేసినతప్పు. తన తల్లి మేనమామనే పెళ్ళాడింది. తన పినతల్లి కూతురు తన స్నేహితుల్లో కొందరు మేనమామలని పెళ్ళాడారు. వారికిలాంటి సంతానం కల్గలేదే పిల్లాతో హాయిగా ఆనందంగా కాపురాలు చేసుకుంటున్నారు. మరి తన కెందుకింత దురదృష్టం. భగవాన్ తెలియక చేసిన తప్పుకి నన్ను శిక్షించు. పాపని ఆరోగ్యవంతురాలిని చెయ్యి. గిరిజ మనసులోనే దేవుడిని ప్రార్థించ సాగింది. 'అమ్మా ఇంకా కుడుతున్నాయి చీమలు' పాప మాటకి ఆలోచన ల్లోంచి బైటపడింది. ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూస్తే వీపుని పట్టుకున్న చీమ కన్పించింది. దాన్ని లాగిపారేసింది.

"అమ్మా నేను దులుపుకోలేను కదా అని తెగ కరిచేశాయమ్మా నాకేమో బాధకి ఏడుపొచ్చేసింది. బిగ్గరగా అరిచేసాను. అప్పుడేమో పక్కింటి బాబిగాడు కిటికీ దగ్గరకి వచ్చి నా ఏడుపును చూసి వెక్కిరించి చిన్న చిన్న రాళ్ళు విసిరాడమ్మా అవన్నీ నాకు తగిలాయి".

"అయ్యో అలాగా.... వుండు వాడిపని చెప్తాను." గిరిజ కోపంతో లేవబోయింది. "వాళ్ళు... సినీమాకిపోయారమ్మా నా కేకలకి పక్కింటి అత్తవచ్చి బాబిగాడిని బాగా కొట్టి చెవులు మెలేసి లాక్కువెళ్ళిందమ్మా. అయినా నాకు ఏడుపొచ్చేసింది. అమ్మా నువ్వు నన్ను వదిలి ఆఫీసుకెళ్ళ కమ్మా" పాప తన బాధని తల్లిదగ్గర వెళ్ళబోస్తూ వుంది.

అలాగే 'వెళ్ళను' అని అనలేకపోతూ వుంది. కూతురికి మాట ఇచ్చినా తమ ఆ మాట నిలుపుకోలేదని గిరిజకి తెల్సు, తను ఇంట్లో వుండ టం పాపకి అవసరం కంపెనీ వాళ్ళు ఇచ్చే డబ్బు తనకి మరీ అవసరం. ఈ చిక్కుముడి విడిపడేలా లేదు ఒకసారి ఎండగానే వుందన్న వుద్దే శ్యంతో పాప మంచం దగ్గరున్న కిటికీ తలుపు తెరిచి వెళ్ళింది తను

ఆఫీసుకి. హఠాత్తుగా వర్షం వచ్చి కిటికీలోంచి జల్లు కొట్టి పాప పూర్తిగా తడిసిపోయింది. తను వచ్చేసరికి తడి పక్కబట్టల్లో గజగజా వణికిపోతూ వుంది. లేవలేని అశక్తత వల్ల కూతురు ఎంత శిక్ష అనుభవిస్తోందో గ్రహించిన గిరిజ గుండె బద్దలయేలా ఏడ్చింది. పాపకి వానలో తడవడం జలుబూ జ్వరం వచ్చింది. ఇలా ఎన్నో వస్తున్నాయి. అప్పుడు తమలో ఒకరు శలవు పెట్టక తప్పదు. డాక్టర్ల చుట్టూ తిరగకా తప్పదు. ప్రవేటు కంపెనీ కావడంవల్ల జీతం నష్టమూ తప్పదు. ఇలా కానప్పుడు ఆఫీసు నుండి అలసిపోయి వస్తే ఇక్కడ కూతుర్ని చూసేసరికి వున్న శక్తి పూర్తిగా పోతుంది. ఇలా ఒక్కరోజు కాదు ఒకనెల కాదు సంవత్సరాలు గడుస్తున్నా 'మార్పు అనేది దొరకడంలేదు. ఇవన్నీ ఆలోచిస్తూంటే 'గిరిజకి భవిష్యత్' భయంకరంగా కన్పిస్తూ వుంటుంది అయినా కూతుర్ని డాక్టర్లకి చూపడం మానలేదు.

ఏ కొత్త డాక్టరు వూళ్ళోకి వచ్చినట్లు తెల్సినా కూతురు జబ్బు నయం చేయగలడేమో అని తీసుకువెళ్ళడం చూపించడం ఆయన చేప్పే మందులు వాడి చూడటం జబ్బు నయం కాకపోగా కొత్త బాధలు కల్గడం అప్పులు మిగలడం ఇదీ గిరిజ సంసారస్థితి. అయినా ఎక్కడో మనసులో 'ఆశ' తన కూతురి కీళ్ళవాతం నయం అవుతుందనీ అందరి పిల్లల్లా స్కూలుకి వెళ్ళి చదువుకుంటూ గంతులు వేస్తూ ఆటలాడగలదనీ.

సైన్స్ ఎంతో అభివృద్ధి చెందిన ఈ కాలంలో కూడా మందులు లేని జబ్బులు వున్నాయంటే ఆశ్చర్యపోతూ వుంటుంది గిరిజ.

"అమ్మా ... అమ్మా" కూతురు పిలుపుకి గిరిజ ఆలోచనల్లోంచి తెప్పరిల్లింది.

"నీ తడి చీరె.... తడి చీరెకి చలి వేస్తోంది నాకు"

అప్పటికి గుర్తువచ్చింది. తను తడి చీరె మార్చలేదని. పాపని పొడి బట్టలు వేసి పడుకోబెట్టి వేడిపాలు పట్టి అప్పుడు మార్చుకుంది బట్టలు. చకచకా వేడి 'టీ' చేసుకుని తాగి వంటపూర్తి చేసుకుని ముందు

గదిలోకి వచ్చింది. పాప నిద్రపోతూ వుంది, 'షిఫ్ట్ పనిలోకి వెళ్ళిన భర్త రాత్రి తొమ్మిది గంటలయితే కానీ ఇల్లు చేరడు. గడియారంలోకి చూసింది. ఏడు గంటలు దాటింది. కిటికీ దగ్గరకి వచ్చి కూర్చుంది, ఎదిరింటి మేడలో దీపాలు వెలుగుతూన్నాయి. టీ వీలో ఏదో సంగీతం విన్పిస్తోంది.

స్వరూప అయిదేళ్ళ కూతుర్ని ముద్దులాడుతూ కన్పించింది. ఆ పాప అందాల బొమ్మలా వుంటుంది. రంగురంగుల ఫ్రాకుల్లో చూడ ముచ్చటగా ఛంగ్ ఛంగ్‌న గెంతుతూ తల్లిదండ్రులని మురిపిస్తూ వుంటుంది. ఆ పిల్లని చూస్తే గిరిజకీ ముచ్చటే. అయిలక్షల ఆస్తికి అధిపతురాలు స్వరూప, ఒకే ఒక్క కూతురు. అనురాగాన్ని పంచి ఇచ్చే భర్త. స్త్రీకి ఇంకేం అదృష్టం కావాలి.

గిరిజ ఆ శ్రీమంతురాలి అదృష్టాన్ని మనసులోనే పొగుడుకుంటూ అలా కూర్చునే నిద్రలోకి జారిపోయింది.

గిరిజకి రెండిళ్ళ అవతల వున్న పంకజంతో స్నేహం. పంకజం భర్త రామ్మూర్తి కూడా గోపీపనిచేసే కంపెనీలో వుద్యోగం చేస్తున్నాడు. పంకజం గిరిజా గోపీ వుద్యోగాలకి వెళ్ళిన సమయంలో అప్పుడప్పుడూ వచ్చి తాళం తెరిచి పాపని చూస్తూ కొంతసేపు వుండి వెడుతూ వుంటుంది. అయితే పంకజం తరుచుగా పుట్టింటికి వెడుతూ వుంటుంది. అలా వెళ్ళినప్పుడల్లా గిరిజకి మరీ ఇబ్బందిగా వుంటుంది. పదిహేను రోజులుగా వూరిలో లేని పంకజం ఈ రోజే వచ్చింది. వచ్చిన రోజునే వచ్చి పాపని చూసి పాలూ వగైరా ఇచ్చి గిరిజవచ్చే వరకూ కూర్చుంది. తనకి ఈ విధంగా సాయపడే పంకజం అంటే గిరిజకి తగని అభిమానం.

గిరిజ ఆఫీసునుండి రాగానే వేడి టీ తెచ్చి ఇచ్చింది పంకజం.

'ఇలా నువ్వు ఇంట్లో వుండిన రోజు నా కెంతో హాయిగా వుంటుంది పంకజం.'

పంకజం నవ్వింది.

"పాపా ఎలా వున్నావమ్మా" కూతుర్ని పలకరించింది.

"అత్త పాలు ఇచ్చింది, ప్రాకు మార్చింది. ఒంటేలు పోసిన బట్టలు మార్చింది. అమ్మా అత్తని మనింట్లోనే వుండమనమ్మా"

పంకజం గిరిజా నవ్వుకున్నారు. ఇంతలో ఎదురింటి మేడ ప్రహారీగేటు తెరుచుకోవడం 'మారుతి' కారు లోపలికి వెళ్ళడం ఆ కారులో నించి స్వరూప నీరసంగా దిగడం పనిమనిషి ఆసరాతో లోపలి కెళ్ళడం కన్పించింది.

"పంకజం ఆవిడకి ఏమైంది?" అడిగింది గిరజ.

"వాళ్ళ బేబీ తర్వాత ఇంక పిల్లలు ఒద్దు అని జాగ్రత్త తీసుకున్నారట. ఆయనకి మాత్రం మరో బిడ్డ కావాలని వుందట. కానీ ఆవిడ ఇష్టపడలేదుట. ఎప్పుడో పొరబాటు జరిగి ఆవిడకి నెల తప్పిందట. అంతే ఆవిడ పిచ్చిపట్టిన దానిలా డాక్టర్ల చుట్టూ తిరగసాగిందిట. తమ ఆస్థికి ఒకే ఒక్క పాప వారసురాలైతే అంతస్తు తగ్గదని ఆవిడ అభిప్రాయంట. అంతే అబార్షన్ చేయించుకుందట. అలా చేయించుకున్నప్పుడు కాస్త సీరియస్ అయి చివరికెలాగో ఆపద నుండి బైటపడిందట.

"అలాగా"

"ఏమిటో గిరిజా శ్రీమంతుల అభిప్రాయాలు చిత్రంగా వుంటాయి కదూ" మరి నేను వెళ్ళివస్తాను' పంకజం వెళ్ళిపోయింది. గిరిజ వంటపని పూర్తి చేసుకుని కూతురుదగ్గరకి వచ్చి కూర్చుంది. గోపీ ఈరోజు త్వరగానే ఇంటికి వచ్చేసాడు. వస్తూ పాపకి బిస్కెట్లూ గిరిజకి సన్నజాజులూ తెచ్చాడు. గిరిజ పూవులు పెట్టుకుని ఎన్నో నెలలైంది.

భోజనాలు అయిన తర్వాత పాప నిద్రపోయిందని తెలుసుకుని గోపి చిరుచాప తీసుకువెళ్ళి వంటగదిలో వేసాడు. "గిరిజా నీకో దిండు తెచ్చుకో" మెల్లగా అన్నాడు. భర్త సంకేతం అర్థమైంది గిరిజకి. అతను అలా పిలిచి ఎన్నో నెలలు అయింది.

'గిరిజ ఆలస్యం చేయలేదు' పాప రాత్రి సమయంలో చాలాసార్లు లేస్తూనే వుంటుంది. 'అమ్మా.... నాన్నా' అంటూ పిలుస్తూనే వుంటుంది.

"సరిగ్గా లేచింది.... అమ్మా భయంగా వుంది. లైటులేదు. చీకటి...."

గోపీకి కూతురుమీద ఎప్పుడూ కోపం రాదు. ఇలాంటప్పుడు తప్ప.

గోపీ లేవలేదు. గిరిజని లేవనీయలేదు. పాప అరుపులు ఆపలేదు.

"పగలల్లా గుర్రుపెట్టి నిద్రపోయి రాత్రి అంతా జాగారం చేయిస్తోంది ఎన్నాళ్ళిలా"

గిరిజ బద్ధకంగా అంది. గోపీకి ఆగ్రహం ముంచుకు వచ్చింది. అంతే విసురుగా లేచి లైటువేసి నాలుగు అంటించాడు కూతుర్ని. తండ్రి ఇలా ఏనాడూ కొట్టడం ఎరుగని పాప కెవ్వుమని భయంతో బిగుసుకు పోయింది. ఈ అరుపుకి గిరిజ తుళ్ళిపడి లేచి వచ్చింది. పాప నిలువు గుడ్లు పెట్టుకుని వుండే సరికి భార్యాభర్తల కోపం ఆవిరిలా ఎగిరిపోయింది.

ఓ పావుగంట తర్వాతగానీ పాప మామూలుగా కాలేదు. అయిన తర్వాత "అమ్మా.... అమ్మా.... నాకు భయం వేస్తోంది" ఏడవ సాగింది.

గిరిజకి ఇదివరకులా జాలి కల్గలేదు. ఎందుకు జాలి కల్గలేదో తెలియడంలేదు. గోపీ ముఖం నల్లగా అయిపోయింది. భార్య ముందు తలెత్తలేని వాడిలా వీధి తలుపు తెరచి గడపలో కూర్చుని సిగరెట్ వెలిగించుకున్నాడు.

నాలుగైదు నెలలు గడిచిపోయాయి. పాపకి నీళ్ళ విరేచనాలు ఎక్కువగా కాసాగాయి. గిరిజ శెలవుపెట్టి ఇంట్లో వుంది. పాపకి సపర్యలు చేయలేక విసిగెత్తి పోతూంది, ఆ విసుగు చాలావరకూ వెళ్ళింది. పాప పిల్చినా పలక్కపోవడం పాపా అని కూతుర్ని ప్రేమగా పిలవకపోవడం. తల్లిలోని మార్పు తెలియని పాప మారాం చేసి ఏడవసాగింది. అది మరీ

విసుగ్గా వుంది గిరిజకి. అ స్తమానం స్వరూపగారి మేడవైపు చూడటంలో సరిపోతూ వుంది. తనకి పెళ్ళి కానప్పుడు ఆలోచనలు ఇలా వుండేవి. స్వరూపగారి లాంటి ఇల్లు కావాలనీ హరిగోపాల్ లాంటి భర్తా వాళ్లపాప లాంటి పాపా ఆ కారులాంటి కారూ వుండి అచ్చంగా స్వరూపలా ఎప్పుడూ కారులో షికార్లూ సినీమాలు స్నేహితులూ చీరెలూ అచ్చంగా అలా వుండాలని వుండేది. పెళ్ళి అయిన తర్వాత ఏ మాత్రం మార్పులేని జీవితం. చివరికి మొగుడైనా కొత్తవాడు కాదు. తనింట్లో పెరిగి పెద్ద అయిన మేనమామే. మేనమామ అయినా ఎలాగోలా మనసుకి సరిపెట్టుకుంది. కానీ ఈ అవిటి పిల్ల తన జీవితంలో ఏ సంతోషం లేకుండా మెడకో గుదిబండ అయిపోవడం భరించలేకపోతూవుంది.

తన ఖర్మ ఇంతే అని సరిపెట్టు కోవాలన్నప్పుడల్లా స్వరూప ఇల్లూ వగైరా గుర్తుకి వచ్చి సహనం చచ్చిపోయి అసహనం పెరిగిపోతూ వుంది. స్వరూప తన సంతోషం కొరకు ఏ పనైనా చేస్తుంది. గర్భిణీ కూడా పోగొట్టుకుంది. తను? తను?

గిరిజ ఆలోచించి ఆలోచించి అలిసిపోసాగింది. ఒకరోజు సాయం కాలం పాపకి పాలుపట్టే టైము అయింది. "అమ్మా పాలు" పాప పిలుస్తోంది.

గిరిజ కాళ్ళూ చేతులూ వణుకుతున్నాయి. అయినా అడుగులో అడుగువేస్తూ పాలగ్లాసుతో వచ్చింది.

"అమ్మా నిన్న నువ్వు ఆఫీసుకి వెళుతుంటె ఏడిచానని కోపం వచ్చింది కదూ రేపటనుండీ ఎడవనమ్మా నిజంగా ఏడవను. నా మీద కోపం తెచ్చుకోకమ్మా. అమ్మా."

'అమ్మా.... అమ్మా' అన్న కూతురు పిలుపుకి గిరిజ చేతిలోని పాలగ్లాసు ఒణికింది. తల్లి మనసు కూతురి మీద ప్రేమతో నిండు గోదారిలా పరవళ్ళు తొక్కసాగింది.

అంతరాత్మ ఎదురుతిరిగింది. గిరిజా ఏం చేస్తున్నావే! కన్నబిడ్డ అవిటిదని నీ సుఖం పోగొడుతుందని నువ్వు.... నువ్వు....

నీచుట్టూవున్న మనుషుల్లో మానవత్వంలేదని విమర్శించే నువ్వు ఏం చేయబోతున్నావ్! చేస్తావా! ఏది చెయ్యి. చెయ్యలేవు. నేను నీ మనసుని. నిన్నాపని చేయనీయను మనసు తిరగబడింది. గిరిజ చేతిలోని నిద్ర మాత్రల పాలగ్లాసు కిందపడి భళ్ళున బద్దలైంది.

సరిగ్గా అప్పుడే లోపల కాలుపెట్టాడు గోపీ కూతురికి బిస్కెట్ల పాకెట్ తో ఇంకేవో మందు సీసాలతో.

"ఏమండీ...." గిరిజ పరుగున వెళ్ళి భర్తని కౌగలించుకుంది.

గోపీకి విషయం ఏమిటో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు.

పగిలిన పాలగ్లాసులోనుండి ఇంకా కరగని మాత్రలు అతని దృష్టిలో పడ్డాయి.

"గిరిజా క్షణికావేశానికి లొంగకుండా...." అతని మాటలు పూర్తి కాలేదు.

స్వరూప గేటు దగ్గర కారు శబ్దం విన్పించి ఆవేశంగా వెళ్ళి కిటికీ తలుపూ వీధి తలుపూ భళ్ళున మూసేసింది.

గోపీకి విషయం పూర్తిగా అర్థం అయింది. ఆ తలుపులు పూర్తిగా తెరుస్తూ.

"గిరిజా ఈ తలుపులు మూసినా మనచుట్టూ వుండే రంగురంగుల ప్రపంచాన్ని ఎలా మూయగలవు. మనసులని ఆధీనంలో వుంచుకునే ప్రయత్నం చెయ్యి. అంటూ 'పాపా' అంటూ పాపనెత్తి ఒళ్ళోకి తీసుకున్న తండ్రివైపు ఏదో అపరాధిలా చూసే తల్లివైపు చూస్తూ "అమ్మా నాన్నా నేనింక ఏడవను'' అంటూ వుంది.

(4-9-86 ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక)